క్లుప్తంగా

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈగల్ ప్రతినిధులు

టెక్కలి: మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలను దుర్భరం చేసుకోవద్దని ఈగల్ విభాగానికి చెందిన అధికారులు ఉదయ్, రామచంద్రరావు అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రయోజనాలపై టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఈగల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ శాంతికుమార్, ఎ.లక్ష్మణరావు, ఎన్ఎస్ఎస్ అధికారి మారుతి, బీఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి ఎం.రమణయ్య పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు కళాశాలను సంప్రదించాలని కోరారు. అలాగే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు తరువాత ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు ఉంటాయని వెల్లడించారు.

'కుట్టు పథకం పేరుతో అవినీతి'


మాట్లాడుతున్న నేతాజీ, ప్రకాష్

కవిటి: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మహిళలకు కుట్టు శిక్షణ పథకం పేరుతో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పూడి నేతాజీ, పార్టీ కవిటి మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ ఆరోపించారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తామన్న పేరుతో అవినీతికి పథక రచన చేశారన్నారు. తొలుత వంద కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పెట్టి.. తరువాత రూ. 258 కోట్లకు అంచనాలు పెంచేసి నిధుల దోపిడీకి ప్రయత్నించారు. రూ. 154 కోట్లు కొట్టేసేందుకు కూటమిలోని కీలక నేత పావులు కదుపుతున్నారని అనుమానం వ్యక్తం చేశారు.

మహిళల ఉపాధి కోసమే కుట్టు శిక్షణ


కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస: డ్వాక్రా మహిళలు కుట్టు మిషన్‌లో శిక్షణ పొంది తద్వారా ఉపాధి పొందాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక మండల వెలుగు కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళల కుట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాలు పెట్టిందే ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో కె.వసంతకుమార్, ఏపీఎం జాంబవతి, పీరుకట్ల విఠల్, లొడగల కామేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జడ్జి కిశోర్‌బాబు

కంచిలి: కార్మిక చట్టాలపై అవగాహన అవసరమని ఆరవ అదనపు జిల్లా జడ్జి కె.కిశోర్ బాబు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవ సంఘం ఆధ్వర్యంలో అంపురం గ్రామంలోని అన్నపూర్ణ పద్మావతి ఇండస్ట్రీస్‌లో అసంఘటిత కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసంఘటిత కార్మికుల భద్రత చట్టం గురించి జడ్జి వివరించారు. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలన్నారు. సోంపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.జగన్నాయకులు, ఎడిషనల్ పీపీ బేసి లక్ష్మీనారాయణ, ప్రభుత్వ న్యాయవాది పి.పాపినాయుడు, స్థానిక ఎస్ఐ పి.పారినాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శైలేంద్ర పాల్గొన్నారు.

పెద్దశ్రీరాంపురంలో.. దాహం కేకలు!

- మినరల్ వాటర్ పథకానికి విద్యుత్ నిలిపివేత
- గ్రామస్తుల ఆందోళన


వాటర్ ప్లాంటు వద్ద ఖాళీ బిందెలు, క్యాన్లతో ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కంచిలి: పెద్దశ్రీరాంపురం గ్రామంలో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. కొద్దిరోజులుగా స్థానిక పాఠశాల ఆవరణలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో శుద్ధజలాల సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులతోపాటు కిడ్నీ రోగులు అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామంలో అన్ని సీజన్లలో నీటికి ఇబ్బందే ఉంటుంది. ఈ పరిస్థితిలో ప్రాథమిక పాఠశాల ఆవరణలోని పాత మహిళా మండలి భవనంలో అమెరికా తెలుగు సంఘం ఆర్థిక సహాయంతో ఉద్దానం ఫౌండేషన్ ద్వారా సంస్థ చైర్మన్‌గా, నియోజకవర్గ వైఎస్సార్‌సీ సమన్వయకర్త పిరియా విజయ నేతృత్వంలో 2013లో మినరల్ వాటర్ పథకాన్ని ఏర్పాటు చేశారు. అయితే కొద్ది రోజులుగా దీనికి విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. ఈ పథకానికి ప్రత్యేకంగా విద్యుత్ మీటర్ లేదు. ప్రస్తుత విద్యాకమిటీ చైర్మన్ తలగాన భాస్కరరావు ఆధ్వర్యంలో మూడేళ్ల నుంచి పాఠశాల విద్యుత్ మీటరు నుంచే కరెంటు సరఫరా చేసుకొని పథకాన్ని నడుపుతున్నారు. నీరు కావాల్సిన వారి నుంచి నామమాత్రంగా డబ్బులు తీసుకొని అందజేస్తున్నారు. తద్వారా వచ్చిన ఆదాయంతో పాఠశాలలో ఇద్దరు వలంటీర్లకు, పథకం నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ఒక ఉద్యోగికి జీతాలు ఇస్తున్నారు. కరెంటు బిల్లును చెల్లిస్తున్నారు. అయితే దీనిపై విద్యుత్‌శాఖకు ఎవరో ఫిర్యాదు చేయడంతో పథకానికి ఇస్తున్న సరఫరాను సిబ్బంది నిలిపివేశారు. దీంతో ఫిల్టర్ చేసిన నీటిని తాగడానికి అలవాటు పడిన ఏడు వందల కుటుంబాలు ఆరు రోజులుగా అవస్థలు పడుతున్నారు. స్థానికంగా ఏర్పడిన వివాదాల కారణంగా విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసి సరఫరా లేకుండా చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గడచిన కొన్నేళ్లుగా పద్ధతి ప్రకారం పథకాన్ని నిర్వహిస్తూ పెద్దశ్రీరాపురం గ్రామంతోపాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు చెందిన వారికి కూడా నీటి అవసరాలు తీర్చుతున్నప్పటికీ ఈ విధంగా ఫిర్యాదు చేసి విద్యుత్ తొలగించి ఇబ్బందులు పాల్జేయడం సరికాదని స్థానిక సర్పంచ్ బల్లెడ సుమన్, విద్యాకమిటీ చైర్మన్ తలగాన భాస్కరరావుల ఆధ్వర్యంలో గ్రామస్తులంతా బుధవారం విలేకరుల ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. నీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కిడ్నీ రోగులు మర్రిపాటి తులసీదాస్, పథకం ఆపరేటర్‌గా పనిచేస్తున్న కిడ్నీ రోగి లండ శంకరరావు, తలగాన శేషమ్మ, కర్రి గురుమూర్తి, గ్రామస్తులు తలగాన రుద్రమూర్తి, తాండ్ర సురేష్, బల్లెడ సునీల్, మెజ్జి శశిరమ్మ, సంధ్య, తలగాన శేషమ్మ చెప్పారు.

విద్యుత్‌శాఖ ఏఈ ఏమన్నారంటే..

ఈ విషయాన్ని మండల విద్యుత్‌శాఖ ఏఈ ఎస్.గురవయ్య వద్ద ప్రస్తావించగా పాఠశాల విద్యుత్ మీటర్ మీద నిర్వహిస్తున్న కారణంగానే విజిలెన్స్‌శాఖ వారు గుర్తించి మొదట్లో సరఫరా నిలిపివేశారన్నారు. తర్వాత కూడా అలాగే నిర్వహిస్తుండటంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. ఈ పథకానికి కేటగిరీ–2లో విద్యుత్ మీటరు కోసం సరైన డాక్యుమెంటేషన్‌తో దరఖాస్తు చేసుకొంటే కొత్త లైన్ ఇవ్వడానికి అభ్యంతరం లేదన్నారు.

పారదర్శకంగా నిర్వహిస్తున్నాం..


పాఠశాల ఆవరణలో ఉన్న ఈ పథకాన్ని పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. పథకం నిర్వహణ కోసం అతి తక్కువ ధరతో ప్రజలకు నీరందించి, తద్వారా వచ్చిన ఆదాయంతో విద్యుత్ మీటరు బిల్లును చెల్లిస్తూ, అక్కడ ఆపరేటర్‌గా నియమించిన కిడ్నీ వ్యాధిగ్రస్తుడు లండ శంకరరావుకు, పాఠశాలలో ఇద్దరు వలంటీర్లకు జీతాలిస్తున్నాం. ఈ లెక్కలు చెప్పడానికి నేను సిద్ధంగా ఉన్నాను. అంతకు ముందు తొమ్మిదేళ్లపాటు నిర్వహణ చేపట్టిన వారు అప్పటి లెక్కలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారా?.

–తలగాన భాస్కరరావు, విద్యాకమిటీ చైర్మన్

ఇబ్బందులు పడుతున్నాం


మినరల్ వాటర్ పథకం ద్వారా నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నాం. బయట నీరు తాగుతుంటే కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తున్నాయి. పథకాన్ని మళ్లీ నడిపించి, నీరందించాలని అధికారులను కోరుతున్నాం.

–నర్తు రాములమ్మ, పెద్దశ్రీరాంపురం

సరఫరా పునరుద్ధరించాలి


పాఠశాల ఆవరణలో ఉన్న మినరల్ వాటర్ పథకానికి నిలిపివేసిన విద్యుత్ సరఫరాను వెంటనే పునరుద్ధరించాలి. ఇక్కడ రాజకీయాలకు తావులేకుండా ప్రజల అవసరాలను గుర్తించి, విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. పాఠశాల మీటర్‌తో నడుపుతున్న ఈ పథకానికి సరఫరా నిలిపివేశారని చెబుతున్నారు. కొత్త మీటరు కోసం దరఖాస్తు చేసినా ఇంతవరకు కనెక్షన్ పునరుద్ధరించలేదు. మండు వేసవిలో ప్రజలు నీటి కోసం అవస్థలు పడుతున్నారు.

–బల్లెడ సుమన్, సర్పంచ్, పెద్దశ్రీరాంపురం

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు


ఇచ్ఛాపురం టౌన్: మున్సిపల్ మేనేజర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం టౌన్: ఈ నెల 20 నుంచి మూడు రోజులు సమ్మె చేయనున్నట్టు మున్సిపల్ కార్మికులు ప్రకటించారు. ఇందుకు సంబంధించి మున్సిపల్ మేనేజర్ వి.అప్పలస్వామికి బుధవారం సమ్మె నోటీసును అందజేసినట్టు ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ కార్మిక సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు రమేష్ పట్నాయక్ తెలిపారు. దేశ వ్యాప్తంగా ఈ నెల 20న సమ్మె చేయడంతోపాటు స్థానిక సమస్యల పరిష్కారం కోసం 21, 22 తేదీలో సమ్మె చేస్తామని నోటీసులో పేర్కొన్నారు. సంఘ నాయకులు బి.తాతారావు, డి.డిల్లీరావు, డి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సమ్మెకు సహకరించాలి


కాశీబుగ్గ: శ్రీనివాసరావుకు సమ్మె నోటీసు అందిస్తున్న సీఐటీయూ నాయకులు

కాశీబుగ్గ: ఈనెల 20వ తేదీన చేపట్టనున్న సమ్మెకు సహకరించాలని పలాస పీసీఎంఏ (పలాస జీడి పరిశ్రమల సంఘం) అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావును సీఐటీయూ నాయకులు కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, కాష్యూ లేబర్ అసోసియేషన్ లేబర్ కాలనీ కార్యదర్శి అంబటి ఆనందరావులు శ్రీనివాసరావును బుధవారం కలిసి సమ్మెకు సంబంధించిన నోటీసును అందజేశారు.


పలాస: సమ్మెనోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీ కార్యకర్తలు..

పలాస: కాశీబుగ్గ ఐసీడీఎస్ సీడీపీవో పార్వతికి అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె నోటీసును అందజేశారు. ఈ నెల 20న దేశ వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా తాము కూడా అందులో పాల్గొంటున్నట్టు నోటీసులో పేర్కొన్నారు. యూనియన్ నాయకులు ఆర్.అప్పలనరసమ్మ, జయలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

కవిటి: కరాపాడు పంచాయతీలోని తోటవీధిలో నిర్మించిన శ్యామలమ్మ అమ్మవారి గ్రామదేవత మందిర ప్రతిష్ట కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ నేతలు సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, నవీన్ కుమార్ అగర్వాలా, ఎం.లచ్చయ్య తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామారావు, ఎంపీపీ పద్మ తదితరులు

కవిటి: లండారపుట్టుగ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు ఎంపీపీ కడియాల పద్మతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2.5 లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ తెలిపారు.

కార్మిక చట్టాలపై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్: ప్రతి కార్మికుడు తమ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పి.పరిష్‌కుమార్ అన్నారు. మేడే వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్మికులతో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు వారి పనితనాన్ని, పని కాలాన్ని గుర్తించి నడుచుకోవాలన్నారు. యువసూర్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, యువ న్యాయవాది ఎం.రాంబాబు మాట్లాడుతూ... కార్మికులు లేనిదే కర్మాగారాలు లేవని, కార్మికుల అవసరాలు, వారి హక్కులకు భంగం కలిగించకుండా యాజమాన్యాలు నడుచుకోవాలని అన్నారు.

ఆదర్శ పాఠశాలలు పిలుస్తున్నాయ్..

- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నాలుగు మోడల్ స్కూళ్లు


రాజపురం ఏపీమోడల్ స్కూల్

కవిటి: ఏపీ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు సమయం ఆసన్నమైంది. అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నాలుగు మోడల్ స్కూళ్లలో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ విధానంలో ఉత్తమ విద్యా బోధన అందిస్తున్నారు. కవిటి మండలం రాజపురం, కంచిలి మండలం ఎం.ఎస్.పల్లి, సోంపేట, ఇచ్ఛాపురం కేంద్రాల్లో ఆదర్శ పాఠశాలలు ఉండగా.. వీటిలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యనందిస్తున్నారు. అలాగే వృత్తివిద్యా కోర్సులను కూడా అకడమిక్ విద్యతో పాటుగా అందిస్తున్నారు. చక్కనైన తరగతి గదులు, ఐఎఫ్‌ఎల్ ప్యానల్ బోర్డులు, కంప్యూటర్ విద్య, ఆధునిక ల్యాబరేటరీ సదుపాయాలు, లైబ్రరీ సేవలు అందుతున్నాయి. బాలికలకు, సుదూర ప్రాంతాల వారికి హాస్టల్ వసతి కల్పించి రెసిడెన్షియల్ విద్యా విధానంలో చదువులు అందిస్తున్నారు. కొన్నిచోట్ల బాలురకు కూడా బీసీ బాలుర వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయి. ఈ విద్యా సంస్థల్లో ఉదయం, రాత్రి వేళల్లో బాలికలకు హాస్టల్లో భోజన సదుపాయం కల్పిస్తుండగా.. మధ్యాహ్నం పాఠశాలలోనే భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఒకే చోట విద్యను పొందే అవకాశం ఉండడంతో చాలామంది వీటిలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తుండగా.. ఆరో తరగతిలో ప్రవేశానికి సంబంధించి ఇప్పటికే పరీక్ష నిర్వహించి ఫలితాలను కూడా వెల్లడించారు. ఇంటర్మీయెట్ విద్యకు సంబంధించి ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీలు గ్రూపులు ఉన్నాయి. వీటిలో ఒక్కో గ్రూప్‌లో గరిష్టంగా 40 మంది విద్యార్థులకు ప్రవేశాలకు అవకాశం ఉంది.

హాస్టల్ ఉండి చదివాను


మాది ఈదుపురం గ్రామం. రాజపురంలోని ఏపీమోడల్ స్కూల్‌లో మంచి విద్యాబోధన అందిస్తున్నారన్న సమాచారంతో ఆరో తరగతిలో చేరాను. ఇక్కడ తొమ్మిదో తరగతిలో వచ్చేనాటికి మోడల్‌స్కూల్ హాస్టల్‌లో చేరాను. ఇటీవల వచ్చిన ఇంటర్ ఫలితాల్లో స్కూల్ టాపర్‌గా నిలిచాను. ఇక్కడ విద్యా బోధన చాలా బాగుంది.

– వి.నీరజ, ఇంటర్ టాపర్, రాజపురం ఏపీ మోడల్ స్కూల్

మే 22 వరకు దరఖాస్తుల స్వీకరణ


ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. టెన్త్ క్లాస్ మెరిట్ కమ్ రోస్టర్‌ను అనుసరించి ప్రవేశాలు కల్పిస్తారు. అలాగే స్కూల్ పునఃప్రారంభంలో టీసీలు తీసుకుని వెళ్లిపోయే వారు ఎవరైనా ఉంటే అప్పటి స్థితిని అనుసరించి ఖాళీలలో కొత్తవారికి నిబంధనల మేరకు ప్రవేశాలు కల్పిస్తాం.

– ఎం.ఈశ్వరరావు, ప్రిన్సిపాల్, ఏపీమోడల్ స్కూల్, రాజపురం,

విద్యార్థులకు సత్కారం


కవిటి మండలంలోని రాజపురం ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణులైన ముగ్గురు విద్యార్థులను శ్రీశైన చైతన్య యువ జన సంఘం సభ్యులు సత్కరించారు. స్థానిక శ్రీశయన సామాజిక మండపంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 570 మార్కులతో పాఠశాల ప్రథముడుగా నిలిచిన పర్రి వినయ్, 500 మార్కులు దాటిన ఆనింగి అనూష, పర్రి మధు, పర్రి గణేష్‌లను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు.

–కవిటి

చికిత్సకు సాయం


పలాస మండలం బ్రాహ్మణతర్లాకు చెందిన వైశ్యరాజు మణి రోడ్డు ప్రమాదంలో గాయపడి శ్రీకాకుళం లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన హెల్పింగ్ వారియర్స్ ప్రతినిధులు రూ.1.64 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. వారియర్స్ ప్రతినిధులు ఎల్.వేణుగోపాల్, ఎస్.నరేష్, ఆర్.జె.ఈశ్వర్, పి.కార్తీక్, కె.అభి పాల్గొన్నారు.

–పలాస

కూటమి పాలనలో అన్నీ స్కాములే..


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 11 నెలల పాలనలో స్కాములు ఫుల్, స్కీమ్‌లు నిల్‌గా మారిందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, జిల్లా నాయకులు ఉంగ సాయిక్రిష్ణ, ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా పని చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సచివాయం వ్యవస్థ నుంచి ఎన్నో చారిత్రాత్మిక మార్పులు చేసి చూపించారన్నారు. 40 ఏళ్ల చరిత్ర అని చెప్పుకునే చంద్రబాబుకు కుంభకోణాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు బత్తిన హేమేశ్వర రావు, దువ్వాడ రవి, ఎన్ షణ్ముఖరావు, బొడ్డు సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం


కాశీబుగ్గ: తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

సోంపేట: సోంపేట పట్టణంలోని పోతూలూరి వీర బ్రహ్మేంద్ర స్వామి 332వ ఆరాధన దినోత్సవాన్ని విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సామాజిక ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు, ఓఆర్ఎస్ కిట్లు అందజేశారు.

కాశీబుగ్గ: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా కాశీబుగ్గలోని శ్రీకంచి కామాక్షి స్వర్ణకారుల సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, విశేష అర్చనలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం స్వామివారి తిరువీధి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘ అధ్యక్షులు పొట్నూరు కన్నాచారి, ఆలయ కమిటీ అధ్యక్షులు భవిరి గోపాల్, పొట్నూరు మురళి, లక్కోజు వాసు, లక్కోజు సంతోష్, సీహెచ్ మోహన్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామదేవత ఉత్సవాల కరపత్రాలు విడుదల


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో జూన్ ఒకటి నుంచి పదో తేదీ వరకు జరగనున్న కంచమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాల కరపత్రాలను ఉత్సవ కమిటీ, గ్రామస్తులు స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలోని శ్రీరామ మందిరం వద్ద బుధవారం సాయంత్రం విడుదల చేశారు. తొమ్మిది రోజులపాటు ఉత్సవాల్లో చేపట్టిన కార్యక్రమాల వివరాలను కరపత్రాల్లో పొందుపర్చారు. వీటిని గ్రామంలో ఇంటింటికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

జాబ్‌మేళాలో 41 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

ఇచ్ఛాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫోక్సికన్ కంపెనీ ప్రతినిధులు బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో 41 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ రబీన్‌కుమార్ పాడి తెలిపారు. జాబ్‌మేళాకు హాజరైన వారికి జాబ్‌డ్రైవ్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపిక నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ చెప్పారు.

ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా ర్యాలీ


కంచిలి: ర్యాలీ చేస్తున్న దృశ్యం


కాశీబుగ్గ: మాక్ డ్రిల్ చేస్తున్న పోలీసులు

కంచిలి: పాకిస్తాన్ ఉగ్రవాదులు చేపట్టిన పహల్గాం దాడులకు నిరసనగా మంగళవారం అర్ధరాత్రి నుంచి భారత్ సైనిక దళాలు ప్రారంభించిన ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా మండల కేంద్రం కంచిలిలో గ్రామస్తులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి బైపాస్ కూడలి వరకు ర్యాలీ సాగింది. భారత సైనిక దళాలకు మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ పోలీసుల మాక్‌డ్రిల్

కాశీబుగ్గ: ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో పలాస రైల్వేస్టేషన్ ఎదురుగా ఎస్సైలు, ఏఎస్సైలు, హెచ్‌సీలు, పీసీలు, హోంగార్డులతో కలిసి మాక్ డ్రిల్ చేపట్టారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని సీఐ తెలిపారు.